క్లుప్తంగా

బాలికోన్నత పాఠశాలలో ఇంటర్‌ అడ్మిషన్లు

తిరువూరు: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నూతన విద్యా విధానంలో భాగంగా ఈ ఏడాది ఇంటర్మీడియెట్‌ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఇంటర్మీడియెట్‌ బోధనకు అవసరమైన పీజీటీ ఉపాధ్యాయుల నియామకం కూడా జరిగిందని, ఇంటర్మీడియెట్‌ బోర్డు నిబంధనల మేరకు అడ్మిషన్లు జరుగుతాయని తెలియజేశారు. వివరాలకు తమ పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

ముమ్మరంగా శానిటేషన్‌ పనులు

వెల్వడం(మైలవరం): మైలవరం మండలం వెల్వడం గ్రామంలో శానిటేషన్‌ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వెల్వడం గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది శనివారం రోడ్లపై చెత్తా చెదారం తొలగించి శుభ్రం చేశారు. డ్రెయినేజీల్లో పూడిక తొలగించి మురుగునీటి పారుదలను సుగమం చేశారు. పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు పనులను పర్యవేక్షించారు.

ఉత్సవ విగ్రహాల వితరణ



మేడూరు(గంపలగూడెం): మండలంలోని మేడూరు అంజనాద్రి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉత్సవ విగ్రహాలను, వెండి కిరీటాలను ఇరువురు భక్తులు అందజేశారు. గ్రామానికి చెందిన ముత్యాల వెంకటేశ్వరరావు, సీతా మహాలక్ష్మి దంపతులు రూ. 80 వేల విలువైన శ్రీదేవి, భూదేవి, సహిత వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను అందజేశారు. ఈ విగ్రహాల ఆలంకరణకు అవసరమైన మూడు వెండి కిరీటాలకు రూ.25 వేలను లింగాల గ్రామానికి చెందిన కాసర వెంకటరెడ్డి, జ్యోతి దంపతులు వితరణగా ఇచ్చారు. దాతలను అర్చకులు బాదంపూడి శివరామలింగప్రసాద్‌ ఆశీర్వదించి సత్కరించారు.

భూ సర్వేకు సహకరించాలి

తిరువూరురూరల్‌: గ్రామాల్లో భూసర్వేకు రైతులు సహకరించాలని తిరువూరు మండల పరిషత్‌ విస్తరణాధికారి వెంకటరత్నం కోరారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో శనివారం జగనన్న భూహక్కు సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సర్వే ప్రయోజనాలను రైతులకు తెలియజేయడంతో పాటు సోమవారం జరిగే డ్రోన్‌ సర్వేలో సమర్పించాల్సిన ధ్రువపత్రాలను పొందాలన్నారు. వామకుంట్ల, ముష్టికుంట్ల, ఆంజనేయపురం, చిట్టాల గ్రామాల్లో సర్వే చివరి దశకు వచ్చినట్లు తెలిపారు.

బీమా నగదు అందజేత

ఆగిరిపల్లి: అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని ఈదులగూడెం ఎస్సీవాడకు చెందిన ముళ్లపూడి శివాజీ మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు వైఎస్సార్‌ బీమా పథకం కింద శనివారం ఆయన కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఈదులగూడెం పీఏసీఎస్‌ చైర్‌పర్సన్‌ ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, సచివాలయాల మండల కన్వీనర్‌ నందూరు భాస్కర్‌ ప్రసాద్‌, సోషల్‌ వెల్ఫేర్‌ అసిస్టెంట్‌ నాగరాజు, వలంటీర్‌ మల్లికార్జున్‌ పాల్గొన్నారు.

కారు బోల్తా



మక్కపేట(వత్సవాయి) : కారు అదుపుతప్పి బోల్తా కొట్టిన సంఘటన శనివారం తెల్లవారుజామున చిల్లకల్లు వైరా రహదారిపై గ్రామశివారులో చోటుచేసుకుంది. జగ్గయ్యపేటకు చెందిన ఒక కుటుంబసభ్యులు పెనుగంచిప్రోలులో జరిగిన ఒక వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళుతున్న సమయంలో కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. అనంతరం కారును క్రేన్‌తో తొలగించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రుద్రవరంలో తప్పిన అగ్నిప్రమాదం



నందిగామ: మండలంలోని రుద్రవరంలో శనివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం తప్పింది. ఎండిన కంప, పొలంలో ఎండిపోయిన మొక్కజొన్న వ్యర్థాలను తగలబెడుతున్న సమయంలో ఆ మంటలు సమీపంలోని కాలనీని చుట్టుముట్టాయి. దీంతో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు జిల్లేపల్లి కమల రాము మరికొందరు స్థానికులు వెంటనే ఫైర్‌ అధికారులకు సమాచారమిచ్చారు. స్పందించిన అధికారులు సకాలంలో గ్రామానికి వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

విలువలతో కూడిన విద్యతో సమాజానికి మేలు

జేఎన్‌టీయూ, కాకినాడ వీసీ డాక్టర్‌ జీవీఆర్‌ ప్రసాదరాజు

మైలవరం: విలువలతో కూడిన విద్యతో సమాజానికి మేలు జరుగుతుందని జేఎన్‌టీయూ, కాకినాడ వీసీ డాక్టర్‌ జీవీఆర్‌ ప్రసాదరాజు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాలలో 2023 మొదటి గ్రాడ్యుయేషన్‌ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాకినాడ జేఎన్‌టీయూ వైస్‌ ఛాన్సలర్‌ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి అధ్యాపకులు, ప్రిన్సిపాల్‌ చేస్తున్న కృషిని అభినందించారు. కాకినాడ జేఎన్‌టీయూ ఎస్‌ఐటీటీటీఆర్‌ ఛైర్మన్‌ డాక్టర్‌ వీ.ఎస్‌.ఎస్‌ కుమార్‌ మాట్లాడుతూ విద్యా విధానం విద్యార్థి సాధించిన మార్కుల ఆధారంగా ఉండకూడదని, ఇన్నోవేషన్‌, ఎంప్లాయ్‌మెంట్‌తో పాటు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ ఓరియంటెడ్‌గా ఉండాలన్నారు. విజయవాడ ఎఫ్టానిక్స్‌ సిస్టం ప్రైవేట్‌ లిమిటెడ్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డీ రామకృష్ణ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్‌లను దేశానికి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో అధ్యాపకుల కృషి కీలకమన్నారు. లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాల విద్యలో ఉన్నత ప్రమాణాలు కొనసాగిస్తుందని, యువ గ్రాడ్యుయేట్‌లను సమాజానికి అందించడంలో సహాయపడుతుందన్నారు. కళాశాల గౌరవ ఛైర్మన్‌ లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి, ఛైర్మన్‌ లకిరెడ్డి ప్రసాదరెడ్డి ఆన్‌లైన్‌లో ప్రసంగించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.



గ్రాడ్యుయేషన్‌ సర్టిఫికెట్లు అందుకుంటున్న ఇంజినీరింగ్‌ విద్యార్థులు

జూనియర్‌ కళాశాల ఏర్పాట్ల పరిశీలన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలలో ఈయేడాది నుంచి బాలికల జూనియర్‌ కళాశాల ప్రారంభానికి చర్యలు తీసుకున్నట్లు ప్రిన్సిపాల్‌ బాలిరెడ్డి శనివారం తెలిపారు. ఈ ఏడాది నుంచి ఎంపీసీ, సీఈసీ, బైపీసీ కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. విద్యా బోధనకు నిష్ణాతులైన అధ్యాపకుల నియామకం జరిగింది. ప్రత్యేక తరగతి గదులు, ల్యాబ్‌ సదుపాయం, కంప్యూటర్‌ తరగతులు, గేమ్స్‌, లైబ్రరీ, డిజిటల్‌ బుక్స్‌ సదుపాయాలు ఏర్పాటు చేశారు. అడ్మిషన్లు పొందే బాలికలు నేరుగా జెడ్పీ పాఠశాల/జూనియర్‌ కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్‌ కోరారు.

కళాశాల ఏర్పాటు హర్షణీయం

కొండపల్లిలో జూనియర్‌ కళాశాల ఏర్పాటు చేయడం హర్షణీయమని డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్‌ అన్నారు. కళాశాలలో ఏర్పాట్లు ఆయన శనివారం పరిశీలించారు. జూనియర్‌ కళాశాల ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.



కొండపల్లిలో బాలికల జూనియర్‌ కళాశాల ఏర్పాట్లు పరిశీలించిన నాయకులు

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఇబ్రహీంపట్నం: ఉద్యోగులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏపీ స్పెషల్‌ ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ అసిస్టెంట్‌ కమాండెంట్‌ టీకే.ఆచారి అన్నారు. ఎన్టీటీపీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఏపీ స్పెషల్‌ ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ సిబ్బందికి దంత, కంటి పరీక్షల ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు శరీరంలో వచ్చే మార్పులు గమనిస్తూ ఉండాలన్నారు. అనంతరం వివిధ హోదాల్లో ఉన్న 70 మంది ఉద్యోగులకు ప్రముఖ వైద్యులు నేత్ర, దంత పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఆహార నియమాలు తెలియజేశారు. సీఐ భాషా, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌లో వైద్య పరీక్షలకు హాజరైన ఎస్పీఎఫ్‌ ఉద్యోగులు

సీసీ రోడ్డు ప్రారంభం



గుడిపాడులో రహదారిని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ ప్రతాప్‌

ముసునూరు: జగనన్న పాలనలో రోడ్ల అభివృద్ధి పనులు ముమ్మరంగా చేస్తున్నామని జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్‌ పేర్కొన్నారు. మండలంలోని గుళ్లపూడి శివారు గుడిపాడులో జెడ్పీటీసీ నిధులు రూ.2 లక్షలతో మండలపు బూసియ్య ఇంటి వద్ద నుంచి చిలకయ్య ఇంటి వరకు 60 మీటర్ల పొడవున నిర్మించిన అంతర్గత రహదారిని శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ కె.రాజానాయన, సర్పంచ్‌ ఆర్‌ శ్రీదేవి శ్రీనివాస్‌, ఉప సర్పంచ్‌ పద్మజా రాంబాబు, పార్టీ మండల కమిటీ సభ్యుడు వేమూరి సురేష్‌, పార్టీ గ్రామ కార్యదర్శి నాగరాజు, పార్టీ నేతలు కొల్లి దుర్గాప్రసాద్‌, ఉలాస వీరవసంతరావు, సోమేశ్వరరావు, అభిమానులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రిటైనింగ్‌ వాల్‌ నిర్మాణ పనులు ప్రారంభం

నూజివీడు: మండలంలోని పల్లెర్లమూడిలో కోనేరు వద్ద రిటైనింగ్‌వాల్‌ నిర్మాణ పనులను సర్పంచ్‌ పులపాక సౌమ్యరేఖ, ఎంపీటీసీ చిలుకూరి అనూర్‌బాషా శనివారం ప్రారంభించారు. బాపులపాడు మండలం బొమ్ములూరు వద్ద నుంచి కొయ్యూరు, పల్లెర్లమూడి, సీతారామపురంల మీదుగా మర్రిబంధం వరకు రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం రూ.23 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా గ్రామంలో కోనేరు వద్ద రిటైనింగ్‌ వాల్‌ నిర్మించాల్సి ఉంది. ఈ సందర్భంగా సర్పంచ్‌ సౌమ్యరేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రహదారి విస్తరణ వల్ల ప్రజలు రాకపోకలు సాగించేందుకు సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ అధ్యక్షుడు యనమదల వేణు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పోలిమెట్ల శివ, ఆర్‌బీకే కన్వీనర్‌ గారపాటి మనోజ్‌కుమార్‌, వీరాస్వామి, కొక్కెరపాటి చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచి సౌమ్యరేఖ, ఎంపీటీసీ అనూర్‌బాషా

గృహ నిర్మాణాలు వెంటనే చేపట్టాలి

నూజివీడు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు వెంటనే గృహ నిర్మాణాలను ప్రారంభించాలని ఎంపీడీఓ అలీఖాన్‌ సూచించారు. మండలంలోని మర్రిబంధంలో లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇల్లు లేని ప్రతి పేదవాడికీ సొంతింటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చి, గృహాల నిర్మాణానికి రూ.1.80 లక్షలను అందజేస్తోందని చెప్పారు. వీటికి తోడు సిమెంట్‌, ఇసుక, ఐరన్‌ ను రాయితీపై అందజేస్తోందని, డ్వాక్రా గ్రూపులో ఉంటే రూ.35 వేల నుంచి రూ.50 వేలకు రుణం బ్యాంకులు ఇస్తున్నాయన్నారు. లబ్ధిదారులు వెంటనే తమ స్థలాల్లో ఇంటి నిర్మాణాలను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌, వైఎస్సార్‌ సీపీ నాయకుడు వడ్డాది త్రినాథ్‌రావు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

నూజివీడు: ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ అలీఖాన్‌ గ్రామ సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని గొల్లపల్లిలో ఉన్న ఒకటో గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కార్యాలయం నుంచి బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను తప్పనిసరిగా కార్యాలయం వద్ద ప్రదర్శించాలన్నారు. రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం సచివాలయంలో నిర్వహించి ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గొల్లపల్లి ఒకటో సచివాలయ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అలీఖాన్‌

కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్‌ జ్యోతి

చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు శనివారం గ్రామ సర్పంచ్‌ విస్సంపల్లి జ్యోతి తన సొంత నిధులతో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. రోహిణి కార్తెలో ఎండలు ఎక్కువగా ఉండడంతో మజ్జిగ ప్యాకెట్లు కూలీలకు కొంత మేరకు ఉపశమనం కలిగిస్తాయని ఆమె చెప్పారు. కూలీలు అప్రమత్తంగా ఉండి ఉపాధి పనులు నిర్వహించాలని ఆమె సూచించారు.

ఆలయ భూముల కౌలు వేలం

నందిగామ: మండలంలోని రాఘవాపురంలో రామలింగేశ్వర స్వామి, మల్లేశ్వర స్వామివార్లకు చెందిన ఆలయ భూములకు దేవదాయ శాఖ అధికారులు శనివారం కౌలు వేలం పాట నిర్వహించారు. స్వామివార్లకు ఉన్న మొత్తం 12.76 ఎకరాల మెరక భూమికి కౌలు వేలం పాట నిర్వహించారు. ఈ పాట ద్వారా స్వామివార్లకు రూ.99,000ల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యాలయ నిర్వహణాధికారి నాగరాజు తెలిపారు.

సంఘ సంస్కర్త వీరేశలింగం

కొండపల్లి (ఇబ్రహీంపట్నం): కందుకూరి వీరేశలింగం పంతులు సాహితీవేత్త, సంఘ సంస్కర్త అని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు అన్నారు. కొండపల్లి శాఖ గ్రంథాలయంలో జేవీవీ ఆధ్వర్యంలో వీరేశలింగం పంతులు వర్ధంతి శనివారం నిర్వహించారు. విద్యార్థులతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల పునర్వివాహం, స్త్రీల విద్య, బాలికల చదువుకు పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయడంలో విశేష కృషి చేశారన్నారు. చిరిగిన చొక్కా అయినా తొడుక్కో ఒక మంచిపుస్తకం కొనుక్కో అనే నినాదం తెచ్చారన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు ఎస్‌.నాగరాజు, సర్దార్‌ సాహెబ్‌, గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

ముసునూరు: మండలంలోని గోపవరం గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం శనివారం బ్రాంచి అధికారి సునీల్‌కుమార్‌ ఆధ్వర్యంలో గ్రంథాలయాల ప్రాధాన్యాన్ని, నీతి కథల ప్రాశస్త్యాన్ని చిన్నారులకు వివరించారు. అనంతరం చిన్నారులకు లెమన్‌ అండ్‌ స్పూన్‌, మ్యూజికల్‌ చైర్‌ ఆటలు ఆడించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు సుబ్బారావు, పాఠకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవరచుకోండి

తిరువూరు: విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా పుస్తక పఠనం అలవరచుకోవాలని తిరువూరు శాఖా గ్రంథాలయాధికారి పద్మావతి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా పుస్తక పఠనం ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఒకసారి చదివితే ఎప్పటికీ గుర్తుండిపోయే విధంగా పుస్తక పఠనం ఉపకరిస్తుందని, మెదడుకు పదును పెట్టే ఎన్నో అంశాలు విజ్ఞాన గ్రంథాల్లో ఉంటాయని పద్మావతి తెలిపారు. నిరంతరం పుస్తకాలు చదివేవారు అనుకున్న లక్ష్యాలను సాధిస్తారన్నారు. ప్రతిరోజూ వార్తా పత్రికలు చదివితే ప్రపంచ విజ్ఞానం తెలుసుకోవచ్చని తెలిపారు. చిత్రలేఖన, హిందీ, సైన్స్‌, క్రాఫ్ట్‌ సబ్జెక్టులపై ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు.



కందుకూరి వీరేశలింగం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జేవీవీ నాయకులు

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

ఆగిరిపల్లి: రోడ్లపై మురుగునీరు ప్రవహించడంతో ధ్వంసమవుతున్నాయి. ఈదర ఎగువ సెంటర్‌లోని బస్టాప్‌ వద్ద డ్రెయినేజీ పూడి పోవడంతో నిత్యం మురుగు నీరు నూజివీడు - విజయవాడ ప్రధాన రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో రోడ్డు ధ్వంసమైంది. ఈ రహదారిపై నివాస గృహాల్లోని వృథా నీరు ప్రవహిస్తోంది. పంచాయతీ పాలకవర్గం స్పందించి పూడిపోయిన డ్రెయినేజీకి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



నూజివీడు-విజయవాడ ప్రధాన రహదరిపై ప్రవహిస్తున్న నీరు

మెరుగైన సేవలు అందించండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్‌ వైఎస్సార్‌ విలేజ్‌ హెల్త్‌ క్లినిక్స్‌కు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఎన్టీఆర్‌ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్‌ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె శనివారం జిల్లాలోని పలు హెల్త్‌ క్లినిక్స్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో కుటుంబ వైద్యుని ప్రోగ్రామ్‌, వైఎస్సార్‌ కంటి వెలుగు కార్యక్రమాల అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలు తనిఖీ చేశారు. కంటి వెలుగు కార్యక్రమంలో అవ్వా తాతలకు కంటి పరీక్షలు చేస్తున్న తీరును పరిశీలించారు. చిన్నారులకు వేస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి సక్రమంగా వేయాలని ఆదేశించారు. ఎన్‌సీడీ-సీడీ నమోదు సంఖ్యల ప్రగతిని సమీక్షించారు. ఎన్‌సీడీ-సీడీ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఆమె కేతవీరునిపాడు, లచ్చపాలెం, గొల్లపూడి 1 విలేజ్‌ హెల్త్‌ క్లినిక్‌లు తనిఖీ చేశారు. డాక్టర్‌ పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



గొల్లపూడి 1 సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ సుహాసిని

సీసీ రోడ్ల నిర్మాణానికి పరిశీలన

పెండ్యాల(కంచికచర్ల) : గ్రామాల్లో సిమెంట్‌రోడ్లు, మురుగునీరు పారుదలకోసం డ్రెయినేజీలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం తగిన నిధులు కేటాయిస్తుందని ఎంపీపీ షేక్‌ మలక్‌బషీర్‌ అన్నారు. మండలంలోని పెండ్యాల ముస్లిం ఏరియాల్లో అంతర్గత గ్రావెల్‌ రోడ్డును సీసీ రోడ్డుగా మార్చేందుకు శనివారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామంలో అన్ని అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చేందుకు మండల పరిషత్‌ నుంచి నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామంలో రూ. 1.50కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.10 లక్షలతో కొత్త సిమెంట్‌ రోడ్డు వేసేందుకు నిధులు కేటాయించామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు షేక్‌ బడేహజరత్‌, పంచాయతీరాజ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఆఫ్‌ ఇంజినీర్‌ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



రహదారిని పరిశీలిస్తున్న ఎంపీపీ మలక్‌బషీర్‌

ఈత నిషేధం

కృష్ణా తీరంలో హెచ్చరిక బోర్డులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణా నది తీరం వెంబడి పలు ప్రాంతాల్లో కృష్ణలంక పోలీసులు కృష్ణానదిలో ఈత కొట్టడం నిషేధమని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇటీవల సరదాగా నదిలోకి ఈతకు వెళ్లి అనేక మంది యువకులు మృత్యువాతపడిన ఘటనలు అనేక చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముందస్తు చర్యలో భాగంగా కృష్ణలంక పీఎస్‌ సీఐ ఎం.వి.దుర్గారావు ప్రజలను హెచ్చరిస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సీఐ దుర్గారావు మాట్లాడుతూ నదిలో సుడిగుండాలు ఎక్కువగా ఉన్నాయి, ఎవరూ నదిలోకి ప్రవేశించవద్దని, ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని సూచించారు. ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నందిగామ: జాతీయ రహదారిపై నందిగామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై పండు దొర తెలిపిన సమాచారం ప్రకారం ఒడిశాకు చెందిన మానస్‌ సుందర్రై(32) విజయవాడ వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు 65వ నంబర్‌ జాతీయ రహదారిపై నందిగామ సమీపంలోని ఫ్లైఓవర్‌పై వాహనం అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ మానస్‌ను వెంటనే నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం ప్రథమ చికిత్స అనంతరం విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

మజ్జిగ పంపిణీ

భీమవరం(వత్సవాయి): వాసవీక్లబ్‌ ఆధ్వర్యంలో గ్రామంలోని గాంధీ సెంటర్లో మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేసి శనివారంతో 27 రోజులకు చేరుకుంది. దాతలు సహకారంతో వేసవి దాహాన్ని తీర్చేందుకు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చార్టర్‌ అధ్యక్షుడు బొగ్గవరపు వెంకటరాజారావు తెలిపారు. ఎండలు తగ్గేవరకు శిబిరాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మద్దు హరిబాబు, కార్యదర్శి కూర్మాల జనార్దనరావు, రవికిరణ్‌ పాల్గొన్నారు.

ఆలయానికి విరాళాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయానికి శనివారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. ఆలయంలోని ఉపాలయం అంకమ్మవారి ఆలయ గోపురం వెండి తాపడం తయారీకి ఆలయ ఛైర్మన్‌ ఇంజం చెన్నకేశవరావు, విజయలక్ష్మీ దంపతులు కాకాని వెంకమ్మ జ్ఞాపకార్థం రూ.10,001 విరాళంగా అందజేశారు. అలాగే ఖమ్మం జిల్లా, బోనకల్లు మండలం ఎల్‌ గోవిందపురం గ్రామానికి చెందిన ధర్మపురి నరసింహారావు, లక్ష్మీ దంపతులు గోశాలలోని గోవుల సంరక్షణకు రూ.13 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కెఅగ్రహారం(జగ్గయ్యపేట): గ్రామ సచివాలయంలో రామ్‌కో సిమెంట్స్‌ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రాజాశేఖప్రసాద్‌ ఆధ్వర్యంలో కంటి వైద్యాధికారి ప్రవీణ రోగులను పరీక్షించి 108 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

నందిగామ: మహిళలకు కుట్టు శిక్షణ ద్వారా జీవనోపాధి కల్పించాలన్నదే తమ ఉద్దేశమని గుడ్‌ విల్‌ ట్రస్ట్‌ వ్యవస్థాపకులు ఏనోష్‌ అన్నారు. మండలంలోని కొత్త బెల్లంకొండవారి పాలెంలో శనివారం మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మొత్తం 30 మంది మహిళలకు రెండు నెలలపాటు కుట్టు శిక్షణ పై అవగాహన కల్పించనున్నట్లు వ్యవస్థాపకులు తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

కృష్ణలంక(విజయవాడతూర్పు): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఉరేసుకుని మృతి చెందిన ఘటన కృష్ణలంక పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాణిగారితోట చలసాని నగర్‌లో నివసిస్తున్న సొందర చందు(43) క్యాటరింగ్‌ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శ్రీలక్ష్మి హోటల్‌లో పనికి వెళ్తుంటుంది. చందుకు మద్యం సేవించే అలవాటు ఉంది. ఇటీవల అప్పులు పెరగడంతో భార్యకు చెప్పి బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం మద్యం సేవించే పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉన్నాడు. రాత్రి భోజనం చేసి నిద్రపోయారు. రాత్రి 10.30 గంటల సమయంలో శ్రీలక్ష్మి లేచి చూడగా అతను రేకుల షెడ్డు రాడ్‌కు లుంగీతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సాయంతో కిందకు దించి 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది అతనిని పరీక్షించి చూసి మృతి చెందినట్లు నిర్ధారించారు. అప్పుల బాధతో తన భర్త ఉరేసుకుని మృతి చెందాడని శనివారం మృతుని భార్య శ్రీలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై ఇనుపచువ్వతో దాడి

చిట్టినగర్‌(విజయవాడపశ్చిమ): యువకుడి మెడపై ఇనుప చువ్వతో దాడి చేసి గాయపరిచిన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణలంకు చెందిన నక్కా నాగగోపి రాణిగారితోటలోని కేఆర్‌ చికెన్‌ షాపులో పని చేస్తుంటాడు. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నాగగోపి చిట్టినగర్‌లోని రామచంద్రరావు బిర్యానీ పాయింట్‌లో చికెన్‌ డెలివరీ ఇచ్చి బార్‌లో మద్యం కొనుగోలు చేసి తాగేందుకు పార్కు రోడ్డులోకి వచ్చాడు. ఆ సమయంలో నాగగోపికి తెలిసిన పండు కనిపించడంతో మద్యంలోకి వాటర్‌ ప్యాకెట్‌ తీసుకురావాలని కోరాడు. దీంతో పండు కోపంతో తనకు చేతికి అందిన ఇనుప చువ్వ తీసుకుని నాగగోపి మెడపై పొడిచాడు. అతను గాయపడటంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.